
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 ఏప్రిల్ 2023





తొలగించిన పాఠాలు తిరిగి చేర్చాలి

ప్రజాశక్తి-నెల్లూరు:పాఠ్యపుస్తకాల్లో చరిత్రకు సంబంధించిన పాఠాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల తొలగించిందని, దేశ చరిత్రకు ఆధారాలైన అంశాలను, పాఠాలను తిరిగి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం బాలాజీ నగర్ లోని రామచంద్రారెడ్డి భవన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీ హర్ష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు చదివే పాఠ్యపుస్తకాలను తయారుచేసే సమస్త , ఎన్‌సిఈఆర్‌టి పాఠ్యపుస్తకాలలో చరిత్రకు సంబంధించిన కథలను, పాఠాలు తొలగించడం దుర్మార్గమన్నారు. పాఠ్య పుస్తకాలలో తొలగించిన కథనాలను మరల తిరిగి పాఠ్యపుస్తకాలలో జతచేయాలని చెప్పారు. లేనిచో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఉద్యమిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కార్యకర్తల శ్రమను మరువను..!

పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల శ్రమను మరువనని, మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం జోన్-4 సమావేశంలో నగరంలోని వేణుగోపాల్‌స్వామి కళాశాల ప్రాంగణంలో జరిగింది. . ఐదు పార్లమెంట్ నియోజక వర్గాల లోని 35 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 2500 మంది నేతలు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉదయం 9.30నుంచి సాయం_త్రం 5 గంటల వరకు సాగింది. 2024 ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలను సిద్ధం చేశారు. పనిచేసే నాయకులకు ప్రోత్సాహం ఉంటుంది. పనిచేయని వారికి దండన తప్పదని హెచ్చరించారు. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇంటింటికి టిడిపి కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశించారు. విజయవాడ నుంచి రోడ్డు మార్గం లో వచ్చి నెల్లూరు నగరంలోని వెంకటేశ్వ రపురం ఎన్టీఆర్ హౌసింగ్ గృహాలను సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లతో సెల్ఫీ దిగి, ముఖ్యమంత్రి జగన్‌కు చాలెంజ్ విసిరారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న మాజీ సిఎం చంద్రబాబు

- పనిచేయని నేతలకు గుర్తింపు ఉండదు
- నేటి నుంచి ఇంటింటికి వెళ్లండి
- టిడిపి క్యాడర్‌కు బాబు పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ అరాచక పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందులో భాగంగానే ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజలు టిడిపికి మద్దతు పలికారన్నారు. నిన్నటి వరకు తల పొగరుతో వ్యవరించిన జగన్ ఎన్నికల ఫలితాలతో ఢీలా పడ్డారన్నారు. మరో నాటకానికి తెరలేపారని, అమాయకుడిగా నటిస్తున్నారన్నారు. 2024 టిడిపి విజయానికి దోహదపడే ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, బాదుడే బాదుడు ..కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు పేలవంగా సాగుతున్నా యన్నారు. కష్టపడి పనిచేసే వారికి అభినందిస్తానని, పనిచేయని వారిని ఉపేక్షించే పరిలేదన్నారు. నాయకులు ఇళ్లలో కూర్చోకుండా జనంలో తిరగాలని పిలుపునిచ్చారు. 35 నియోజకవర్గాల్లో బాగా పనిచేసిన క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, మండల, బూత్ కమిటీ నేతలను ఆయన వేదిక పైకి ఆహ్వానించి మాట్లాడించారు. తన దగ్గర అందరి నేతల జాబితా ఉందని, మరో నాలుగునెలలకు మళ్లీ ఇదే సమా వేశం ఏర్పాటు చేస్తానని, అప్పటికీ మారకపోతే తానే మార్పు తాానని హెచ్చరించారు. కష్టపడి పనిచేసే చోట మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని దించడానికి సిద్ధంగా ఉన్నారని, నాయకులు ఉత్సాహంగా పనిచేయా లన్నారు. కార్యకర్తల కోసం పనిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశమేనని, కార్యకర్తలను ఏ కష్టం రాకుండా కాపాడు కుంటానన్నారు. ఐదు జిల్లాలో జరుగుతోన్న అక్రమాలు, అవినీతిపై ఆయన నిప్పులు చెరిగారు. నెల్లూరు జిల్లాలో సిలికా పేరుతో వైసిపి ప్రభుత్వం మూడు వేల కోట్లు కొల్లగొట్టిందన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇప్పించడంలోనూ నిర్లక్ష్యంగా ఉందన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిజ స్వరూపం తెలియక ప్రజలు ఎన్నుకు న్నారని, ఎన్నికైనప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారన్నారు. నిరుపేదల కోసం టిడిపి ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తే ఆ ఇళ్లను పేద ప్రజలకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. తాను నెల్లూరు నగరంలో వేలాది ఇళ్లు నిర్మించానని, ఒక్క ఇళ్ల పంపిణీ చేయకుండా సర్వనాశనం చేశారన్నారు. కోట్లాది రూపాయలు విలువైన ఇళ్లు శిథిలమైపోయా యన్నారు. మద్యం, గంజాయి రాజ్య మేలు తుందని, ప్రజల జీవితాలు అతాలకుతలమై పోతున్నాయన్నారు. అందుకే జగన్ కేన్సర్ గడ్డగా చెబుతు న్నారన్నారు. కేన్సర్‌ను చిన్నగడ్డగా ఉన్నప్పుడే గుర్తించి ఆపరేషన్ చేసి తీసేయాలని , లేదంటే శరీరం మొత్తం సర్వనాశనమై పోతుందన్నారు. జగన్ ఈ రాష్ట్రానికి కేన్సర్ గడ్డలాంటి వారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి విజయం తథ్యమన్నారు. ఇప్పటికే మూడు జోన్‌ల సమావేశాలు నిర్వహించామని, మరో రెండు నిర్వహిస్తామన్నారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కార్యకర్త లను ఎన్నికలకు సిద్ధం చేసేలా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నిన్నటి వరకు వైనాట్ కుప్పం అంటూ విర్రవీగిన జగన్, ఇప్పుడు ఏమీ మాట్లాడడం లేదన్నారు.తాను ఇప్పుడు చెబుతున్నానని, వైనాట్ పులివెందుల అంటునానన్నారు. ప్రతి కార్యకర్త , నాయకులు రేపటి నుంచే ఇంటింటికి వెళ్లాలని, పార్టీ కార్యక్రమాలు నిర్వహించని వారికి గుర్తింపు ఇవ్వనన్నారు. ఈ సమావేశానికి 2500 మంది క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లతోపాటు, మండల అధ్యక్ష, కార్యదర్శిలు, పార్టీలోని సీనియర్ నేతలు హాజర య్యారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చె న్నాయుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఎంఎల్‌సి శ్రీకాంత్, ఆనం వెంకటర మణారెడ్డి, గూటూరు కన్నబాబు, టిడిపి సీనియర్ నేతలు చెంగళ్ రాయుడు, శ్రీనివాసులురెడ్డి, దామచర్ల జనార్ధన్, జనార్ధన్‌రెడ్డి, ఉగ్ర నరసింహరెడ్డి, టి.రమేష్‌రెడ్డి, పనబాక లక్ష్మీ, టి.అనురాధ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితోపాటు 35 నియోజకవర్గాల టిడిపి నేతలు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

పోగొట్టుకున్న నగదు జమ

ప్రజాశక్తి-నెల్లూరు :ఇటీవల కాలంలో ఆధార్ బయోమెట్రిక్ ద్వారా కోల్పోయిన రూ.45 లక్షల నగదును తిరిగి బాధితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు ఎస్‌పి సిహెచ్ విజయరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎఈపిఎస్ నేరాలను ఛేదించేందుకు బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకోని ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక బృందం చేసిన దర్యాప్తులో జిల్లాలో ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులకు సంబంధించి రూ.45లక్షలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. బ్యాంకు వినియోగదారులు తమ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నగదు డ్రా చేసినట్లు గుర్తించిన 24 గంటల్లో 1930 లేదా సమీప పోలీసు స్టేషన్, సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఆ విధంగా చేసిన వెంటనే ఆయా ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, అదే సమయంలో వ్యక్తిగత ఆధార్ బయోమెట్రిక్ బ్లాక్ చేయడం ద్వారా కొంత వరకు నిరోదించడం సాధ్యమౌతుందన్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్ కాఫీ లేకపోతే నగదు జమచేయడం జరగదన్నారు. ఈ సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బిఆర్ అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు

సామాజిక న్యాయ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా పట్టణంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎపి మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు నివాళులర్పించారు. ఏప్రిల్‌లో మహనుభావులందరికి నివాళులు అర్పించి వారి స్ఫూర్తిని దశ దిశల వ్యాప్తి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, గాండ్లహరిప్రసాద్, చనమాల కోటేశ్వరరావు, పంది నరసింహం ,ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

దరిద్రానికి..అంబాసిడర్ 'చంద్రబాబు'

ప్రజాశక్తి-నెల్లూరు

దరిద్రం.. కరువు.. అరిష్టం..కాటకం అన్న మాటలకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ సిఎం నారాచంద్రబాబునాయుడని, అటువంటి వ్యక్తి నోటి నుంచి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి పట్టిన అరిష్టం..దరిద్రం అని మాట్లాడటం నవ్వుపుట్టిస్తుందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు కరువు, దరిద్రం విలయతాండవం చేసిందని, ప్రజలకు, పశువులకు కనీసం తాగునీరు అందిందా అని ఎద్దేవా చేశారు. పంచాయతీల్లో, కార్పొరేషన్లలో టిడిపి అభ్యర్థులు గెలుపొందారని చెప్పారని, అన్ని స్థానాలకు టిడిపి అభ్యర్థులు అసలు పోటీ చేశారా అని ప్రశ్నించారు. వాలంటరీ వ్యవస్థపై విషం చిమ్మడం తప్ప మరొకటి చేతకాదన్నారు. ప్రజారంజక పాలన చేసి ఉంటే ప్రజలందరూ టిడిపి వైపు ఉంటే రాష్ట్రంలో 23 సీట్లకు మాత్రమే ఆ పార్టీ ఎందుకు పరిమితమైందో ఆలోచన చేయాలన్నారు. సమాజంలో ఇలాంటి వ్యక్తి జీవించే అర్హత ఉందా అన్నది ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. నిజంగా ప్రజలకు చెప్పాలనుకుంటే తాను ఇళ్లు కట్టించినప్పటికీ పంపిణీ చేయలేకపోయానని ఒప్పుకోవాలన్నారు. వాస్తవానికి కట్టిన ఇళ్లను నిరుపేదలకు ఎందుకు పంపిణీ చేయలేకపోయారో (కమీషన్లు అందకపోవడంతో) తెలియజేయాలన్నారు. కమీషన్ల కోసం మాత్రమే ఇళ్ల నిర్మాణం టిడిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు. పేదవారి సొంత ఇంటి కళలను నిజం చేయకుండా షేర్‌వాల్ టెక్నాలజీ అంటూ .. అధిక రేట్లతో నిర్మాణ పనులు చేశారన్నారు. కేవలం కమిషన్ కోసం కక్కుర్తిపడి ఇళ్ల పంపిణీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా రుజువు చేశామన్నారు. అసెంబ్లీ నిర్మాణాల నుంచి సచివాలయ నిర్మాణం వరకు సదరు కాంట్రాక్టర్ వద్ద ఏ విధంగా కమీషన్లు తీసుకున్నారో ఈడి విచారణ (తీగలాగితే డొంకంతా కదులుతుందన్న చందంగా) చేస్తే తెలుస్తుందన్నారు. తమరు ఎంత అవినీతి పరులో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఐదు సంవత్సరాల టిడిపి పాలనలో చేపట్టిన భవన నిర్మాణాలు కేవలం దోచుకోవడానికి తప్ప మరొకందుకు కాదన్నారు. చంద్రబాబునాయుడు వంద జెన్మలెత్తినా వైసిపి ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసినంత నివాస స్థలాలు పంపిణీ చేయలేదన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఆరోగ్యం అందరి బాధ్యత:డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-నెల్లూరు:ఆరోగ్యం ప్రతి ఒక్కరీ కనీస బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పిలుపు మేరకు పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి ఏసీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ పీఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ "అందరికీ ఆరోగ్యం" అనే నినాదంతో జరుపుకుంటున్నామని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్యానికి ఇచ్చిన నిర్వచనం ఏంటంటే మనిషి కేవలం శారీరకంగానే గాక మానసికంగా, సామాజికంగా, రాజకీయంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యవంతుడని, శారీరకంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మనం తినే ఆహారం పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1948 లో మొదటి ప్రపంచ ఆరోగ్య సభను ఏర్పాటు చేసిందన్నారు. ఇది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఏర్పాటుకు పిలుపుని చ్చిందన్నారు. మొదటి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఏప్రిల్ 7, 1950న నిర్వహించ బడిందన్నారు.

పొగాకు బోర్డును సందర్శించిన అధికారి

ప్రజాశక్తి-కందుకూరు:పొగాకులో వచ్చిన సూర ముక్కను బోర్డులో కొంటారని పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారి సిద్దరాజు శుక్రవారం తెలిపారు.కందుకూరు పొగాకు బోర్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పొగాకు ముక్క, సూర వేలం కేంద్రంలోనే అమ్మకం జరుగుతుందని తెలిపారు. పొగాకు బోర్డు ఇచ్చిన బేల్ పట్టాలతో బేల్‌లు కట్టాలన్నారు. తూకం 150 కేజీలకు మించరాదన్నారు. రెగ్యులర్ అమ్మకపు కోటాలో కలపవదన్నారు. ఇది పూర్తి అదనపు కోటాగా పరిగణిస్తారని తెలిపారు. పొగాకు సూరను ఒక బెర్న్‌కి 5 క్వింటాలు చొప్పున అమ్ముకోవచ్చు అన్నారు. అమ్మకపు తేదీలు త్వరలో తేలుపుతామన్నారు. పొగాకురైతులకు ముఖ్యగమనిక. పొగాకు సూర అమ్మదలిచిన రైతులు మీ వద్ద ఉన్న పొగాకు ముక్క బేళ్ల వివరాలను మీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. లేనిచో మీ పొగాకు సూర అమ్ముకొనుటకు అనుమతించబడదు. రైతులు గమనించి ఈ ఆవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పొగాకు రైతులు బేళ్లు బోర్డుకు తెచ్చే ముందు ఒకసారి బేళ్లలో హీట్, తేమ ఉందేమో చూసుకోవాలన్నారు. ఎందుకంటే హీట్, తేమ ఉన్న పొగాకు బేళ్లు అమ్మకం జరగకుండా తిరస్కరించబడునని తెలిపారు. రైతులు దయ చేసి గమనించాలని కోరారు.



నాయకుల పనితీరు భేష్

ప్రజాశక్తి-కందుకూరు:35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కందుకూరుకు 5వ ర్యాంక్ సాధించినట్లు జోన్-4సమీక్షా సమావేశంలో ప్రకటించి, ఇంటూరి నాగేశ్వరరావును చంద్రబాబునాయుడు అభినందించారు. తెలుగుదేశం పార్టీ జోన్-4సమీక్షా సమావేశం నెల్లూరులోని శ్రీ వేణుగోపాలస్వామి డిగ్రీ కాలేజ్ ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు సహా పలువురు నేతలు హాజరయ్యారు.కందుకూరు నియోజకవర్గం గురించి ప్రస్తావిస్తూ, సభ్యత్వ నమోదు, ఓటర్ వెరిఫికేషన్, కమిటీల నియామకం, ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహణ, అందులో భాగంగా రచ్చబండ కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారం, ప్రజాసమస్యలు తెలుసుకోవడం, స్థానిక సమస్యలపై పోరాటం, ఇంకా పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. మొత్తంగా పనితీరులో కందుకూరు నియోజకవర్గం 75 శాతంతో, 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.ఉలవపాడు మండలంలో 11వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పోలుబోయిన శ్రీనివాసులు కు 8వ ర్యాంకు, కందుకూరు పట్టణానికి చెందిన 27 వ యూనిట్ ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వర్లుకు 7వ ర్యాంకులు ప్రకటించారు. మొత్తంగా కందుకూరు నియోజకవర్గం లో పనితీరు బాగుందని నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశానికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీ నరసింహం, పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ నాదెండ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌లు హాజరయ్యారు.



మాజీ సిఎం చంద్రబాబును సత్కరిస్తున్న దృశ్యం

టిడిపి సమావేశానికి తరలిన నేతలు

ప్రజాశక్తి -కందుకూరు:నెల్లూరులో జరిగిన తెలుగుదేశం పార్టీ జోన్-4 ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ పరిధి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు బయల్దేరారు. నియోజకవర్గం నుంచి ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు శుక్రవారం నెల్లూరుకు చేరారు.



చంద్రబాబును కలిసిన 'ఇంటూరి'


ప్రజాశక్తి-కందుకూరు:నెల్లూరులో జోన్-4 ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ పరిధి సమావేశానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం స్వాగతం పలికి మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధించిన విషయాలను ఆయన వివరించారు.



-విద్యార్థులను అభినందిస్తున్న కంచర్ల రామయ్య

జాతీయ స్థాయి పోటీలలో రెండు ప్రథమ బహుమతులు

ప్రజాశక్తి-కందుకూరు:ఒంగోలులో ఓ ఇంజినీరింగ్ కాలేజీ జాతి స్థాయిలో నిర్వహించిన పరిశోధన పత్ర, ప్రాజెక్ట్ పోటీలలో ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమ స్థానాలలో నిలిచి సత్తా చాటారని అకాడమిక్ ఇన్ ఛార్జి ఎస్ఎం మీరావలి వెల్లడించారు. సోలార్, వాయు విద్యుత్ ఉత్పత్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేయడంలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారం పై ప్రకాశం విద్యార్థులు రూపొందించిన పరిశోధన విశ్లేషణ పత్రానికి ప్రథమ బహుమతి దక్కడం హర్షనీయమని పేర్కొన్నారు. సమాజ హిత నమూనా ప్రాజెక్టుల రూపకల్పనలో గత రెండు దశాబ్దాలుగా పేరుగాంచిన తమ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి ప్రశంస పత్రంతో పాటు నగదు బహుమతిని పొందడం విశేషమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలలో రెండు అంశాలలో తమ విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకోవడం అభినందనీయమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా రైతుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని ప్రాజెక్టులు రూపొందించాలనేది ప్రకాశం సంకల్పమన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే అడవి జంతువుల భారీ నుండి పంటల రక్షణను ఉద్దేశించి రూపొందించిన క్రాఫ్ సేవర్ తమకు ఎంతో కీర్తి ప్రతిష్టలను సాధించి పెట్టిందని వివరించారు. ప్రాజెక్ట్ రూపకల్పనలో విద్యార్థులు డి.సునీల్ కుమార్, కె.సాయికుమార్ రెడ్డి, ఎం.సతీష్ భాగస్వామ్యం వహించారు. పరిశోధన పత్ర విశ్లేషణ కే.మనీషా చౌదరి నిర్వహించి ప్రథమ స్థానం పొందారు.



ఘనంగా సీతారాముల కళ్యాణం

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక పెద్ద బజారులో వేంచేసి ఉన్న కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. పెద్ద బజారులో మురారిశెట్టి స్వామి ఇంటి వద్ద సీతారాముల వారి ఎదుర్కోల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు:గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక జెడిబిఎం టౌన్ బాప్టిస్ట్ చర్చిలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ గడ్డంజాన్ మాట్లాడుతూ క్రీస్తు లోకమునకు రక్షకుడై ఉన్నాడు.కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు చదలవాడ కొండయ్య, జంగాల ప్రభు కుమార్, మద్దాలి రమేష్, కొండేటి కరుణాకర్, గోచిపాతల కొండయ్య, షేక్ వాయిద్ అహ్మద్, స్త్రీల సమాజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు

మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారు. గుడ్ ఫ్రైవేడుకలను పురస్కరించుకొని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు గుడ్ఫ్రై డే శుభాకాంక్షలు తెలియజేశారు.



మాట్లాడుతున్న ఎస్‌పి విజయారావు

'మొబైల్ హంట్' సేవలు సద్వినియోగం

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా పోలీసు యంత్రాంగం ఇటీవల ప్రారంభించిన 'మొబైల్ హంట్' సేవలు ప్రజలు ఆశించిన స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారని ఎస్‌పి సిహెచ్ విజయరావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో మొబైల్ హంట్ సహాయంతో సెల్‌ఫోన్ వినియోగదారుల నుంచి పోలీసు శాఖకు అందిన ఒక్క సందేశంతో స్పందించి పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన రూ.45 లక్షలు విలువ చేసే 204 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఈ సేవల ద్వారా 4 కేసులకు సంబంధం ఉన్న నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 7 సెల్‌పోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మొబైల్ హంట్ అనే వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో ఇటీవల ప్రారంభిం చామన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో అత్యంత ప్రతిభను కనపరిచిన సైబర్ క్రైమ్ విభాగం సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. జిల్లాలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా మొబైల్ నెంబరు 9154305600 కు వాట్సాప్ ద్వారా సందేశం పంపించాలన్నారు. ఈ సదుపాయాన్ని ఎవరైనా మిస్‌యూజ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ పోగోట్టుకున్న వారు తమ ఫోన్‌కు సంబంధించిన రశీదు, ఆధారాలు చూపించి రికవరీ చేసిన వాటిలో ఉన్నట్లు గుర్తిస్తే అందజేస్తామన్నారు.

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'



కరపత్రాలు పంచుతున్న నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు

సిఎం జగన్ మోహన్ రెడ్డి నేతత్వంలో రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు అనేపేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వవార్డు ఏకలవ్య నగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగానే ఇంటింటికి గహసారథులు ఇంటి యజమానులను కలుసుకున్నారు. వారితో మమేకమై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమానికి సంఘీభావం తెలిపేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వం మధ్య ఉన్న తేడాలను వివరించారు. జగనన్న అమలు చేస్తున్న విధానాలు గురించి ఆరాతీశారు. కుటుంబ యజమానులు అనుమతి మేరకు తలుపు, ఫోన్ స్టిక్కరును అతికించారు. కార్యక్రమంలో గహసారథులు సయ్యద్ జాస్మిన్, అడపా వెంకటరత్నం, వాలంటీర్లు కోమలి, కన్వీనర్లు నగళ్ళ నారయ్య, షేక్. మస్తాన్ వలీ, ఎలికా పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు: మండలంలోని భీమవరం గ్రామపంచాయతీ సచివాలయం 2 పరిధి లో రాజుపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం లాంఛనంగా శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కొమ్మూరు కనకారావు, జిజిఎంపి నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇంటూరి హరిబాబు, జేసిఎస్ మండల కన్వీనర్ వెలిచర్ల ధనకోటి, సచివాలయ కన్వీనర్ నరసరాజు, వాలంటీర్లు, గహసారథులు ,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాపూరు

మండల పరిధిలోని సిద్ధవరం గ్రామ పంచాయితీ సచివాలయంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మార్కెటింగ్ చైర్మన్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పాపకన్ను మధు రెడ్డి, మండల కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు.కిట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు

జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గహ సారథులకు, వాలంటీర్లకు సూచించారు. జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం లాంచింగ్‌ను పురస్కరించుకొని మండలంలోని 16 సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సచివాలయాల ఇన్‌ఛార్జి (జేసీఎస్) తలమంచి సురేంద్ర బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. గ్రామ నాయకులు, వాలంటీర్లు, గ్రుహ సారధులు వార్డు మెంబర్లతో కలసి జగనన్న నువ్వే మా భవిష్యత్ అనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ విజయాన్ని మంత్రి గోవర్ధన్ రెడ్డికి కనుకగా ఇవ్వాలని సురేంద్ర బాబు వాలంటీర్, గ్రుహ సారధులను, గ్రామ నాయకులను కోరారు.

నెల్లూరు డెస్క్

ముత్తుకూరు వైసిపి చేపట్టిన నూతన కార్యక్రమం మా నమ్మకం నీవే జగన్ అవగాహన కార్యక్రమం మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమం జరిగిన అన్ని అవగాహన కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు. ముసునూరు వారి పాలెంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి మునుకూరు జనార్దన్ రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు మునుకూరు రవికుమార్ రెడ్డి, ముసునూరు వారి పాలెం సచివాలయం కన్వీనర్ పఠాన్ సుభాన్ బాషా, వైసిపి యువ నాయకులు సుధీర్ రెడ్డి, పైనాపురం సర్పంచ్ విజయకుమార్, ఎంపీటీసీ సభ్యులు శివ, కృష్ణపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు, సర్వేపల్లి సోషల్ మీడియా కన్వీనర్ ఉదయ భాస్కర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ శ్రీకాంత్, కష్ణ కాంత్, గృహసారథులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గృహసారథులు ఇంటింటికి వెళ్లి పార్టీ పంపిణీ చేసిన మెటీరియల్ గహ యజమానులకు అందజేశారు. మండల సచివాలయాల కన్వీనర్ నెల్లూరు శివప్ర సాద్ అవగాహన కార్యక్రమంలో తెలియ౦జేయడమే కాకుండా, అందుకు అవసరమైన మెటీరియల్ ను అందజేశామని తెలిపారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఉలవపాడు:మండలంలోని భీమవరం సచివాలయం (2) పరిధిలోని రాజుపాలెం గ్రామములో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి మండల ఎంపీపీ వాయల మస్తానమ్మ, వైఎస్ ఎంపీపీ .సయ్యద్ ఫజల్, జెడ్‌పిటిసి అరుణమ్మ. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ మల్లి

దళితులను మోసం చేస్తున్న సిఎం

ప్రజాశక్తి-కావలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల ఆశయాలను తుంగలో తొక్కి, వారిని మోసం చేస్తున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి ధ్వజమెత్తారు. ఏప్రిల్ అంతా భారత సామాజిక ఉద్యమ రథసారథులైన బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు ఉన్నప్పటికీ వారి ఆశయాలను జగనన్న దెబ్బతీస్తున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంబేద్కర్ సామాజిక అసమానతలు తొలగించాలని వర్ణ వివక్షలు పోవాలని కోరుకుంటే ఎస్‌సి ఎస్‌టి కార్పొరేషన్లను మూత వేసి వారికి రావాల్సిన రాయితీలు రుణాలను ఇవ్వలేదని తెలియజేశారు. సంక్షేమ హాస్టళ్లను నాడు-నేడు కింద రూ.1000 కోట్లతో బాగుచేస్తామని ఆ ఊసే ఎత్తలేదని, ఉన్న హాస్టళ్లలో 50 హాస్టళ్లలో ఎత్తివేశారని పేర్కొన్నారు. ఉన్న హాస్టళ్లలో కూడా సబ్బు డబ్బులు కూడా ఇవ్వకుండా అవి తల్లుల అకౌంట్లో వేయడం వల్ల అవి బ్యాంకు వారు జమ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విధంగా దళిత గిరిజన బాలికలకు హాస్టల్ వసతి లేకపోవడం వలన చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసి తల్లిదండ్రులు వారిని పంపించి వేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులు బిడ్డలు మాత్రం విదేశాలలో చదువుకుంటున్నారని ఆరోపించారు. జ్యోతిరావు పూలే బడుగు వర్గాల బాలికలకు విద్య నేర్పిస్తే అవి తీసివేసే నాడు లేదు.. అని వంపించి వేస్తున్నారని తెలియజేశారు. జగ్జీవన్ రామ్ ఆశయమైన అరుంధతీయులకు కనీసం డప్పు కళాకారులకు చర్మ కళాకారులకు పారిశుధ్య కార్మికులకు ఇచ్చే రుణాలు ఇవ్వనీయకుండా దెబ్బతీశారని ఆరోపించారు. అసలు కార్పొరేషన్లను ఎత్తివేసేన వారు దళితులకు సంబంధించిన భూములు ఇంటి స్థలాలను తన వర్గం వారితో దాడులు చేయించి ఆక్రమించుకుంటున్నారని తెలియజేశారు. ఏప్రిల్‌లో ఉన్న సామాజిక ఉద్యమ నాయకుల లక్ష్యాలను జగన్ ప్రభుత్వం దెబ్బతీస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, వెంకటేష్, విజయరత్నం, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కావలి

డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ, పి.ఎ.సి.ఎస్‌ల ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య అవగాహన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం నినాదం 'అందరికీ ఆరోగ్యం' అని, 'అందరికీ ఆరోగ్యం' నినాదంతో మహిళలను భాగస్వాములను చేయాలని భావిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉండడం అంటే ప్రతిఒక్కరూ శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బాగుండడం అని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అనేది ప్రజలందరూ మంచి ఆరోగ్యాన్ని కలిగి, శాంతియుతమైన, సంపన్నమైన స్థిరమైన వాతావరణంలో సంతోషకరమైన జీవితాలను గడపడం సమాజాన్ని నిర్మించడమన్నారు. డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ వారు బిఎస్ పాలీ సిరప్‌లు, కాల్షియం టాబ్లెట్, మల్టీ విటమిన్ సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా ఎస్.యు.ఓ.వి, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఆరోగ్యం అంటే రోగం లేకపోవడం మాత్రమే కాదని, శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పూర్తిస్థాయిలో హాయిగా, ఆనందంగా ఉండడం అని ప్రముఖ వైద్యులు, రెడ్‌క్రాస్ రక్త కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ), జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు ఆరోగ్య అంశాలపై యువ ప్రతినిధులు ప్రసంగించారు. అంటు వ్యాధులపై డాక్టర్ వి జాహ్నవి, అనువంశిక వ్యాధులపై డాక్టర్ కె.మధుసూర్య, బాలింతలు, శిశు వ్యాధులపై డాక్టర్ పి.స్వాతి, పర్యావరణ ప్రతికూల వ్యాధులపై డాక్టర్ చెన్ను భువిజ, అంతర్జాతీయ ఆరోగ్య బీమాపై డాక్టర్ పి.మధుతరుణ్ లు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ బి సతీష్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి రవిప్రకాష్, గంధం ప్రసన్నంజనేయులు, ప్రముఖ వైద్యులు వివి సుబ్బారావు, శ్రీధర్, నళినిపద్మ, చెన్ను ప్రసాద్, ఉషారాణి, ఆనంద్, రేవంత్, రమ్య, భారతి, టీం సేవియర్స్ సభ్యులు ప్రణీత్, రమణ్ సుందర్, హర్ష, ధీరజ్, కీర్తి, సౌందర్య దీపిక, నవ్య, మాన్య, శ్రావణి, జన విజ్ఞాన వేదిక సభ్యులు ఖాదర్ బాషా, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండల వ్యాప్తంగా క్రైస్తవులు చర్చీలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లోకరక్షణ కోసం మరణించిన యేసుక్రీస్తు కోసం ఉపవాసాలు ఉండి, యేసు త్యాగాన్ని తలచుకుంటూ క్రైస్తవులంతా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ క్రీస్తు కృపకు పాత్రులు కావాలన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని విరువూరు, కృష్ణంరాజు పల్లి, కొండాయపాలెం, జడదేవి, బోయమడుగు, దక్కునూరు, వరికుంటపాడు, టిమ్మారెడ్డిపల్లి, పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు క్రైస్తవులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 వరకు భక్తి శ్రద్ధలతో చర్చిలలో ఉపవాస ప్రార్థనలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కావలి : పట్టణంలోని రోజమ్మ రాజు మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పాస్టరమ్మ రజిని జాన్‌సన్, పల్లవిలు క్రైస్తవ గీతాలను ఆలపించారు. ప్రత్యేకపాటను సిస్టర్ హెప్సిబా ఆలపించారు. పాస్టర్ జాన్‌సన్ గుడ్‌ఫ్రైడే (శుభశుక్రవారం) విశిష్ఠతను వివరించారు. తదుపరి శిలువపై ఏసు క్రీస్తు పలికిన 7మాటలను కుమారి సుప్రియ, కె.అనిల్‌కుమార్, పి.ఉషారాణి, కె.వెంకట్రావుకుమారి ఐజెసి లావణ్య, టి.మనోహర్, బి.చంద్రశేఖర్‌లు వివరించారు. చివరగా కె.వెంకట్రావు కుటుంబం భక్తులకు జ్యూస్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్రైస్తవులు, భక్తులు, సండేస్కూల్ పిల్లలు, స్థానికులు పాల్గొన్నారు.

వేడుకగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వింజమూరులోని ఎర్రబల్లిపాలెం సీతారామ తోటలో వేంచేసి యున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం తెల్లవారుజామున శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఉభయ దాతలుగా ఎర్రబెల్లిపాలెం భక్తులు వ్యవహరించారు. భాజా భజంత్రీలు మంగళ వాయిద్యాలు బాణా సంచాలు నడుమ స్థానిక ఎర్రబల్లి పాలెం నుండి ఉభయాన్ని ఆలయానికి భక్తిశ్రద్ధలతో తీసుకువెళ్లారు. మూల విరాట్ స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు సాక్షిగా మాంగల్యం తంతున మీనా అంటూ మాంగళ్య ధారణ జరిగింది. ముత్యాల తలంబ్రాలను గణపం రమణారెడ్డి దంపతులు స్వామి వారి పాదాలకు పోసి వేద పండితుల ఆశీర్వాదాలు పొందారు. ఆలయ వంశపార్యపర్య ధర్మకర్తలు గణపం వెంకటరమణారెడ్డి గణపం సుదర్శన్ రెడ్డిలు కళ్యాణోత్సవం ఏర్పాట్లను పర్యేక్షించగా, ఆలయ ఈవో మల్లికార్జున్ రెడ్డి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ చెన్నకేశవ స్వామి కృపకు పాత్రులు అయ్యారు.

జగనన్న పాలనలో రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ప్రారంభం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతినిత్యం అహర్నిశలు కృషి చేస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన మళ్లీ రావాలని, అందుకోసం ప్రతి ఒక్కరం సమిష్టిగా పనిచేద్దామని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేజర్ల మండలం మామూడూరు గ్రామంలో "జగనన్నే మా భవిష్యత్తు" కార్యక్రమాన్ని నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సింగసాని గురుమోహన్, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కాక రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధి పరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు సుమారు రూ.2లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల రూపంలో అందచేసి వారి కళ్లలో ఆనందాన్ని నింపారని పేర్కొన్నారు. అలాంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అందరూ మరోమారు ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో 2800 మంది గృహసారథులు స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు, వారికేమైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు ముందుకొచ్చారని, ఇలాంటి వ్యవస్థతో ప్రజలకు ముఖ్యమంత్రి అందజేస్తున్న బృహత్తర కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కోఆర్డినేటర్లు, కన్వీనర్లు గృహసారథులు ప్రతి ఒక్కరూ 14రోజుల పాటు అంటే ఏప్రిల్ 20వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అందజేయాలని, అలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను వివరించే విధంగా ఉండాలని సూచించారు. ప్రజా మద్దతు పుష్కలంగా ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న సమయంలో వారి మాటల ద్వారా ఇది స్పష్టమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి స్వయంగా పలు గృహాలను సందర్శించి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సందర్భంగా గత ప్రభుత్వం పనితీరు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పాలన గురించి వివరిస్తూ వారి ఇష్టానుసారం స్టిక్కర్లను స్వయంగా వారి గృహాలకు అతికించారు. కార్యక్రమంలో ఎంపిపి బాలినేని రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, పీర్ల పార్థసారథి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : రాష్ట్రంలోని ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ వారి ఉద్యోగుల భవిష్యత్తు కోసం ప్రతినిత్యం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, యువ నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, 5వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, సచివాలయ కన్వీనర్ ఖాజావళీ, గృహ సారథులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : జగనన్న మా భవిష్యత్తు బోచర్లను ఆర్ అండ్ బి అతిథి భవనంలో నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని పూసల కాలనీలో జగనన్న భవిష్యత్తు కార్యక్రమాన్ని నియోజకవర్గ వైసిపి నాయకులతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకుని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఇంటికి స్టిక్కర్ అతికించి 8296082960 అనే ఫోన్ చేశారు. అనంతరం మెట్టుకూరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండు నెలల క్రితమే నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారని కొన్ని అని వారిని కారణాల వల్ల రాలేకపోయామన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడం క్షమించాలన్నారు. ఉదయగిరి ఆత్మకూరు వెంకటగిరి నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఉదయగిరి అని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి రంగాల్లో మెట్ట ప్రాంత ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. అనంతసాగరం మండలం మెట్ట ప్రాంతమైన ఉదయగిరి పై సుదీర్ఘ ఏడు సంవత్సరాలు అనుభవం ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రతి కార్యకర్త నాయకులు సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు ఐక్యతతో కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలు నాయకులు ఐక్యమత్యంగా పనిచేసి నియోజకవర్గంలో వైసిపి జెండా మరల రెపరెపలాడేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మాట్ల శాంతి, సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతి, కోఆప్షన్ నెంబర్ సుభాని, హక్కుల రెడ్డి వెంగళరెడ్డి, నాయకులు, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో వైసిపి నేత, మండల రైతు విభాగం అధ్యక్షులు గూడూరు శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో "మా నమ్మకం నువ్వే జగన్" ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసపు హామీలు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబడే వ్యక్తిగా "చెప్పాడంటే చేస్తాడంతే" అనే విధంగా చెప్పిన హామీలు చేసిన పనులపై 5 ప్రశ్నలు అడగగా జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు కంటిన్యూ చేయాలని ఆయా కుటుంబ సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కరోనా సమయంలో శక్తి వంచన లేకుండా ఆర్థిక సంక్షోభం తట్టుకొని అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు ఇతర వ్యవసాయ పనిముట్లు సబ్సిడీకి అందించినట్లు తెలిపారు. ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తోడ్పాటుతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. ప్రస్తుతం రైతాంగానికి ప్రకృతి అనుకూలించి ఎకరాకు 5 పుట్ల ధాన్యం పండడమే కాక మద్దతు ధర రూ.20వేల వరకు లభించిందన్నారు. ప్రజలు ఆలోచించి రానున్న ఎన్నికలలో వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి బుక్‌లెట్స్‌తో పాటు స్టిక్కర్లను అందజేశారు. కార్యక్రమంలో కొమరిక ఉప సర్పంచ్ కె.సురేంద్ర, గృహ సారథులు చేవూరు చంద్రమౌళి, రాజ్యలక్ష్మి, సచివాలయం కన్వీనర్లు బండ్ల జనార్ధన్, మంధా శ్రీలక్ష్మి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరిలో ఎంపిడిఒ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, ఎంపిపి మెట్టుకూరి శిరీష ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకొని 8296082960 అనే ఫోన్ చేశారు. ఆ నెంబర్‌తో లబ్ధిదారునికి స్పందన రావడంతో సంతృప్తి చెంది ఇంటికి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వెలగపాడు సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి, వెంకి, తిరుమల, సతీష్, కార్యకర్తలు పాల్గున్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరిలో అంబేద్కర్ నగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సరికొత్త కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి మండల కన్వీనర్ కాటన్ రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి వాళ్ల సమస్యలను అడిగి తెలుసుకొని 8296082960 అనే ఫోన్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మొలక శ్రీనివాసరెడ్డి కూనిపోగు ఇర్మియ తిరుపాలు నర్రవుల మాల్యాద్రి, కార్యకర్తలు వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిలో.. మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను శుక్రవారం సచివాలయం-5 పరిధిలో వార్డు నెంబర్ 12,13 వార్డుల్లో ఆవిష్కరించారు. 12 వార్డు కౌన్సిలర్ కందుకూరు యానాదిరెడ్డి 13 వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ 13 వార్డు కన్వీనర్ పిరాట్ల రాజకుమార్ జొన్నవాడ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల్లోకి వెళ్లి సచివాలయ పరిధిలో ఉన్న కుటుంబ సభ్యులతో జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేళ్లలను వివరించారు. లబ్ధిదారులు వారిని సంతోషంగా ఆహ్వానించి జగనన్న వలంటీర్ల వ్యవస్థను కొనియాడారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎన్ని అందుతున్నాయని తెలుసుకుని వారితో కాసేపు ముచ్చటించి అనంతరం వారి సమక్షంలోనే వారి ఇంటికి మా నమ్మకం నువ్వే అతికించారు.



ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల, పడమటి కంభంపాడు, ఉప్పలపాడులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పి సంపూర్ణమ్మ ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజా సర్వే నిర్వహించారు. మండల సచివాలయకో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ఉప సర్పంచ్, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల కేంద్రంలో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎఎస్‌పేట గ్రామ సర్పంచ్ షేక్.తాజ్ ఉన్నీసా బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి చేరుకొని జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలలో లబ్ధి పొందారా లేదా అన్న విషయాన్ని గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి బొమ్మ ఉన్న గోడప్రతిని ఇంటి ముఖద్వారంపై అతికించారు. అలాగే యజమాని చరవాణితో సభ్యత్వం నమోదు చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు భవిష్యత్తులో నిరంతరం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జీలాని బాషా, వార్డ్ మెంబర్ షకీల్, విద్యార్థి విభాగం మండల కన్వీనర్ పఠాన్ నాయాబ్, టౌన్ ప్రెసిడెంట్ షేక్ కాలేషా, సచివాలయం కన్వీనర్లు వసీం, వాలంటీర్లు, గృహ సారథులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండారెడ్డి ఎంపికపై హర్షం

ప్రజాశక్తి-జలదంకి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నవరం ఎంపిటిసి సభ్యులు (మండల ఉపాధ్యక్షులు) పాలవల్లి మాలకొండా రెడ్డిని నెల్లూరు జిల్లా వైసిపి ప్రచార విభాగం అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు హర్షం వ్యకం చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డిని, ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డిని, ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతోపాటు జెడ్‌పిటిసి శివలీలమ్మ, జలదంకి సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, గుర్రం జగ్గయ్య నాయుడు, కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు, బివి.కృష్ణారెడ్డి, ఎస్.వి.శేషారెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, వట్టికాల బాలయ్య పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-సంగం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కారు స్టాండ్ యూనియన్ నాయకులు శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎస్ఐ నాగార్జున రెడ్డి ప్రారంబించారు. స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు మజ్జిగను అందించారు. వేసవి దృష్ట్యా బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరి బరిలో నిలిచేందుకు సిద్ధం..

- వైసిపి నేత చేజర్ల సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కావలి

వైసిపి అధిష్టానం ఆదేశిస్తే ఉదయగిరి నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు తాను సిద్ధమని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉదయగిరి మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం రాత్రి జలదంకి మండల సచివాలయాల కన్వీనర్, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మను చేజర్ల పరామర్శించారు. ఇటీవల ఇందిరమ్మకు స్వల్ప ప్రమాదం జరిగింది. దీంతో ఇందిరమ్మ ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మనందరం ఇప్పటినుండి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఉదయగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడి ఉందని ముఖ్యమంత్రి సహాయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నలిపే నడిపేందుకు తను కృషి చేస్తానని తెలిపారు. అధిష్టానం తనకు ఏ బాధ్యతలో అప్పగించిన పని చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నారని చేజర్ల తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ దగుమాటి శ్రీకాంత్ రెడ్డి, శివాలయం కమిటీ చైర్మన్ వాక శ్రీనివాసులు రెడ్డి, గున్నం రెడ్డి కృష్ణారెడ్డి, చప్పిడి శ్రీనివాసులు, పాల్గొన్నారు.



ఇందిరమ్మతో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

నేడు వందేభారత్ రైలు ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట : దేశంలోనే ప్రతిష్టాత్మకంగా రైల్వే శాఖ నిర్వహిస్తున్న వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు నడిచే రైలు ప్రారంభోత్సవాన్ని దేశ ప్రధాని ఈ నరేంద్ర మోడీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శనివారం ప్రారంభిస్తున్న తరుణంలో రైలును బిట్రగుంట, నెల్లూరు రైల్వే స్టేషన్లో మాత్రమే ప్రారంభోత్సవ హాల్టింగ్ ఇచ్చినట్లు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ వందేభారత్ రైలు సందర్శించే నిమిత్తం బిట్రగుంటలో స్టాపింగ్ కల్పించినందుకు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం సాయంత్రం ఈ రైలు 6:45 నిమిషాలకు బిట్రగుంట రైల్వే స్టేషన్ చేరుకుంటుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎఫ్ ఆరోగ్య రాజ్, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ మెంబర్, రైల్వే ట్రైన్ ఏ గ్రేడ్ డ్రైవర్ పిల్లి జీవన్ కుమార్, ఎకె భాగ్యరాజ్, షేక్ ఖాదర్, దాసరి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మాజీఎంపి మేకపాటిని కలిసిన నేతలు



ప్రజాశక్తి-ఉదయగిరి : మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డిని ఉదయగిరి వైసిపి నేతలు శుక్రవారం నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్‌తో కొందరు ఎంఎల్ఎకు అనుకూల వైసిపి నేతల వర్గం ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ విషయాల గురించి ఆయనతో చర్చించారు. అదేవిధంగా తమకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని పలువురు నేతలు కోరారు. మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ముత్తుజ హుస్సేన్, సర్పంచులు కల్లూరు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తిరుపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

ఇఫ్తార్ విందులో ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చేజర్ల మండలం మామూడూరు గ్రామంలోని మసీదులో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లీం సోదరులకు కలసి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదుకు విచ్చేసిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి ముస్లీం మత పెద్దలతో కలసి దువా చదివి అనంతరం వారితో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఉండే ముస్లీం సోదరులకు ఆయురారోగ్యాలను ఆ దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- సమాచారం తెలిపినా పట్టించుకోని అధికారులు
- జెసిబి నిర్వాహకులదే కీలక పాత్ర

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని పబ్బులేటిపల్లిలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండానే నాళా చట్టానికి తిలోదకాలిచ్చి అక్రమ మట్టి రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పబ్బులేటిపల్లి పంచాయతీ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు తరలింపునకు జెసిబి నిర్వహకులే కీలకపాత్ర పోషిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఎవరికైనా మట్టి కావాల్సి ఉన్నా జెసిబి నిర్వాహకులను సంప్రదిస్తే సరిపోతుందని వినికిడి వినపడుతుంది. ప్రభుత్వ సెలవు దినాలే అదునుగా చేసుకొని కొంత మంది అక్రమార్కులు మాత్రం ప్రభుత్వ భూములు ఇరిగేషన్ చెరువులలో జెసిబి మిషన్ ద్వారా గ్రావెల్ తవ్వుకుంటూ పబ్బం గడుపుతున్నారు. అందులో భాగంగా పబ్బులేటిపల్లి చెరువులో శుక్రవారం అక్రమ మట్టితవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగాయి. రెవెన్యూ ఇరిగేషన్‌తో సహా పలుశాఖల అధికారులకు తాయిలాలు అందించి యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్ల భారీగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిళ్లుతుందని పలువురు విమర్శిస్తున్నారు. చెరువులు ప్రభుత్వానికి సంబంధించిన ఆదాయ వనరయినప్పటికీ యథేచ్ఛగా మట్టి మాఫియా జెసిబి మిషన్ల ద్వారా తవ్వుకుంటున్నారు. ఇరిగేషన్ ప్రదేశాలలో కానీ రెవెన్యూ ప్రదేశాలలో మట్టిని తరలించేందుకు రెవెన్యూ శాఖకు తగిన చలానా రుసుము చెల్లించాల్సి ఉన్నా అటువంటి పరిస్థితి మండలంలో లేదు. దాని వల్ల ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయల మేర గండి ఏర్పడుతుంది. జిల్లాలో ఎక్కడ అక్రమ మట్టి తవ్వకాలు జరిగినా కఠినమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఏ మాత్రం బేఖాతర్ చేయకుండా అక్రమార్కులకు ఆటంకం కలిగించకుండా అధికారులు నడుచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు సమాచారం ఇచ్చినా అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నిలుపుదల చేసి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జెసిబిల ద్వారా తవ్వకాలు జరుపుతున్న దృశ్యం